జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | 13 | మార్చి | 2025 ◆ పేజీలు : 5

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు




- రోడ్డు ప్రమాదాల నియంత్రణకు వాహనదారుల్లో అవగాహన కల్పించాలి
- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు .

**కొత్తగూడెం క్రైమ్, మార్చి 12, ప్రజాజ్యోతి :** జిల్లా లోని పోలీసు అధికారులతో బుధవారం నేర సమీక్షా సమావేశాన్ని పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ రోహిత్ రాజు సమావేశమయ్యారు. గత నెలలో వర్టికల్స్ వారీగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో

మిగతా 2 లో...



## అవగాహనతో... ఆరోగ్యాన్ని కాపాడుకుందాం...

మన శరీరం నుంచి అనవసరమైన వ్యర్థాలను తొలగించడానికి కిడ్నీలు పనిచేస్తాయి. కిడ్నీల్లో లోపం ఉంటే శరీరంలో పోషకాలు బయటకు వెళ్లిపోతాయి. శరీరంలోని ఖనిజాలు, నీరు మొదలైన వాటి సమతుల్యతను కాపాడుకోవడానికి కిడ్నీలు సరిగా పనిచేయాల్సిందే. చాలామంది ఉప్పు ఎక్కువగా తినడం, ధూమపానం, మద్యం తాగడం మూత్రపిండాలకు హానికరం అనుకుంటారు అంతవరకు నిజమే కానీ మనకు ఆరోగ్యంగా అనిపించే అనేక అలవాట్లు కూడా కిడ్నీ వ్యాధులకు కారణం అవుతున్నాయన్నది నిజం.

◆ అశ్వారావుపేట, ప్రజాజ్యోతి

2 లో..

- మూత్రపిండాల విషయంలో జాగ్రత్తలు అవసరం
- ఆరంభంలో గుర్తిస్తే కిడ్నీ చికిత్స తేలికవుతుంది
- పోషక ఆహారం తీసుకుంటూ... జీవనశైలిని సరిగా ఉంచుకోవాలి
- గత రెండు దశాబ్దాలుగా కిడ్నీ సంబంధిత సమస్యల కేసులు వేగంగా పెరుగుతున్నాయి
- చిన్నారులు సైతం ఈ వ్యాధి బారిన పడడం ఆందోళనకరం
- ప్రపంచ కిడ్నీ దినోత్సవ సందర్భంగా ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం



## రాజ్యాధికారం బీఆర్ఎస్ దే

- బీఆర్ఎస్ ను రూపుమాపడం ఎవరి తరమూ కాదు
- కేసీఆర్ మొండి మనిషి - ఆయనతోనే తెలంగాణ సాకారం
- అహంపూరిత రాజకీయాలకు చోటు లేదు
- ఆ పది స్థానాల్లో ఉప ఎన్నికలు
- పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కసరత్తులు
- కొత్తగూడెం పై అధిష్టానం ప్రత్యేక దృష్టి
- "ప్రజాజ్యోతి" తో ముచ్చటించిన రేగా కాంతారావు.

2 లో...

## బండ బాదుడు..!

- గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది చేతివాటం
- రూ. 158 అదనంగా వసూలు చేస్తున్న వైనం
- రూ. 842 సిలిండర్ కు రూ. 950 అంటున్న సిబ్బంది
- రూ. 1000 తీసుకొని మిగిలిన డబ్బులు ఇవ్వని సిబ్బంది
- సిలిండర్ ధరపై రూ. 108 అదనపు బాదుడు
- చిల్లర లేదనే సాకుతో రూ. 50 స్వాహా చేస్తున్న వైనం
- నష్టపోతున్న వినియోగదారులు
- శ్రీ లక్ష్మి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకం?
- టేకులపల్లిలోనూ రూ. 930 వసూలు!
- అధికారులు స్పందించాలని ప్రజల వేడుకోలు

**ఇల్లందు, మార్చి 12, ప్రజాజ్యోతి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సబ్సిడీ సిలిండర్ల పై గ్యాస్ ఏజెన్సీ గ్రామీణ ప్రాంత ప్రజల నుంచి రూ. 150 దోచుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు రూ.842కు అందిస్తుండగా గ్రామీణ ప్రాంత ప్రజల నుంచి ఆధారంగా రూ.108 వసూలు చేస్తూనే చిల్లర లేదని సాకుతో మరో రూ. 50 ను అదనంగా తీసుకుంటున్నారు. అమాయక గ్రామీణ ప్రజల నుంచి అదనంగా డబ్బులు దండుకుంటున్న గ్యాస్ ఏజెన్సీ డెలివరీ బాయ్స్ వైఖరి పట్ల గ్రామీణ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ సిలిండర్ పై అదనంగా డబ్బులు తీసుకుంటున్న విషయంపై పలుమార్లు ప్రశ్నించిన అప్పుడు మేము రాలేదని దాటు వేసే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ప్రతిసారి గ్యాస్ తీసుకున్నప్పుడల్లా అదనంగా రూ. 150 పైగా వసూలు చేస్తున్నారని దీనిపై గట్టిగా అడిగితే గ్యాస్ ధర పెరుగుతుందని అందుకే తీసుకుంటున్నట్లు తెలుపుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. పేద ప్రజలకు సబ్సిడీపై అందిస్తున్న గ్యాస్ ను గ్యాస్ ఏజెన్సీలు మాత్రం డెలివరీ బాయ్స్ తో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో సైతం గ్రామీణ ప్రాంతాలకు సరఫరా చేసే శ్రీ లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీ సిలిండర్ పై అదనంగా భాదుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ శాతం చదువుకున్నవారు ఉండడం, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు నిరక్షరాస్యులు కావడం వల్లనే గ్యాస్ సిలిండర్లపై అధికంగా తీసుకుంటూ మోసం చేస్తున్నారా అని ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. సిలిండర్ పై అధికంగా తీసుకుంటున్నారు.



### టేకులపల్లిలో సిలిండర్ రూ. 930

టేకులపల్లి మండల కేంద్రంలో సైతం ఒక్కో సిలిండర్ పై రూ. 930 వసూలు చేస్తున్నట్లు పక్కా సమాచారం. ప్రభుత్వం నిర్దేశించిన ధర కన్న అధికంగా డెలివరీ బాయ్స్ వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. గ్యాస్ సిలిండర్ పై అధికంగా డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారని

మిగతా 2 లో...

# రాజ్యాధికారం బీఆర్ఎస్ దే

- బీఆర్ఎస్ ను రూపుమాపడం ఎవరి తరమూ కాదు
- కేసీఆర్ మొండి మనిషి- ఆయనతోనే తెలంగాణ సాకారం
- అహంపూరిత రాజకీయాలకు చోటు లేదు
- ఆ పది స్థానాల్లో ఉప ఎన్నికలు
- పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కసరత్తులు
- కొత్తగూడెం పై అధిష్టానం ప్రత్యేక దృష్టి
- "ప్రజాజ్యోతి" తో ముచ్చటించిన రేగా కాంతారావు.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 12, ప్రజాజ్యోతి:** రాష్ట్రంలో మళ్లీ రాజ్యాధికారం బీఆర్ఎస్ పార్టీదేనని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు అన్నారు. గడిచిన 15 నెలల కాలంలోనే ఏం కోల్పోయామో ప్రజలకు తెలిసొచ్చిందని, కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. ప్రజాజ్యోతితో బుధవారం ముచ్చటించిన ఆయన పలు విషయాలను వెల్లడించారు. అహంపూరిత రాజకీయాలకు ఇక్కడ చోటు లేదని, అలాంటి కుటిల బుద్ధిని చూపిస్తున్న కాంగ్రెస్ నాయకుల తీరును ప్రజలు ఎండగట్టే సమయం రాబోతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను లేకుండా చేయడం ఎవరి తరమూ కాదని స్పష్టం చేశారు. మా నాయకుడు కేసీఆర్ మొండి మనిషి అని, ఆయనతోనే దశాబ్దాల తెలంగాణ కల సాకారమైందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ఒక్క ఓటమితో కొట్టుకుపోయే పార్టీ కాదని, భవిష్యత్ తరాలకి మా పార్టీ సిద్ధాంతాలు దిక్సూచిగా నిలుస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ లోకి ఫిరాయించడం దుర్మార్గమైన చర్య అని, అట్టి స్థానాల్లో ఉప ఎన్నికలు తప్పకుండా జరుగుతాయని ధీమా వ్యక్తం చేశారు. తిరిగి ఆ స్థానాలని బిఆర్ఎస్ కైవసం చేసుకోబోతుందని అన్నారు. రాష్ట్ర ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వ గ్రాఫ్ పడిపోతోందని, ఆ పార్టీ మరెన్నడు కోలుకోలేదని ఆయన జోస్యం చెప్పారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ మరింత పుంజుకుంటుందన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో పార్టీ మీటింగ్ లు ఏర్పాటు చేసి కార్యకర్తలకు అందుబాటులో ఉన్నామన్నారు. మా హయంలో మొదలుపెట్టిన అనేక అభివృద్ధి పనులకు కాంగ్రెస్ నాయకులు అడ్డుపడుతున్నారని విమర్శించారు. పాత టెండర్ లను రద్దు చేసి తిరిగి రీ టెండర్ ద్వారా తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తులకు ఈ కాంట్రాక్ట్ పనులను అప్పగిస్తున్నారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయకుండా ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసగించిందని మండిపడ్డారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో మా పార్టీ నేతలు ఉత్సాహంతో పని చేస్తున్నారని, రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు వెళ్తున్నామన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో సరైన నియోజకవర్గ స్థాయి నాయకుడు లేనందున కొంత పార్టీ కార్యకలాపాలు యాక్టివ్ గా లేవని, త్వరలోనే దీనిపై రాష్ట్ర అధిష్టానం నిర్ణయం తీసుకోనుందని తెలిపారు. ప్రతిపక్ష హోదాలు బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తున్నామని ప్రజలకు, కార్యకర్తలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటామన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి...)

అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ నివారణా చర్యలను చేపట్టాలని ఆదేశించారు. అనంతరం అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని వెల్లడించారు. పోక్సో కేసులలోని నిందితులకు త్వరతగతిన శిక్ష పడే విధంగా కృషిచేయాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, మట్కా, క్రికెట్ బెట్టింగులు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతి ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చేసి నేరాల నియంత్రణకు పాటుపడాలని వివరించారు. రాబోయే నెలలో జరగనున్న భద్రాచలం శ్రీరామనవమి ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు బందోబస్త్ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిత్యం రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నిత్యం వాహన తనిఖీలు చేపడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. షీ టీమ్స్, భరోసా కేంద్రాల ఆవశ్యకత గురించి అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేసి భాధిత మహిళలకు అండగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ స్, ఇల్లందు డిఎస్పీ చంద్రభాను, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామీ, డీసిఆర్బీ సీఐ శ్రీనివాస్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ఐటీ సెల్ సీఐ నాగరాజు రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అవగాహనతో ఆరోగ్యాన్ని కాపాడుకుందాం...

**అశ్వారావుపేట, మార్చి 12, ప్రజాజ్యోతి:** మన శరీరం నుంచి అనవసరమైన వ్యర్థాలను తొలగించడానికి కిడ్నీలు పనిచేస్తాయి. కిడ్నీల్లో లోపం ఉంటే శరీరంలో పోషకాలు బయటకు వెళ్లిపోతాయి. శరీరంలోని ఖనిజాలు, నీరు మొదలైన వాటి సమతుల్యతను కాపాడుకోవడానికి కిడ్నీలు సరిగా పని చేయాల్సిందే. చాలామంది ఉప్పు ఎక్కువగా తినడం, ధూమపానం, మద్యం తాగడం మూత్రపిండాలకు హానికరం అనుకుంటారు అంతవరకు నిజమే కానీ మనకు ఆరోగ్యంగా అనిపించే అనేక అలవాట్లు కూడా కిడ్ని వ్యాధులకు కారణం అవుతున్నాయన్నాది నిజం. వాటి అధిక వినియోగం కుడా మన కిడ్నీలు మీద చెడు ప్రభావాన్ని చూపిస్తుంది.ప్రపంచవ్యాప్తంగా కిడ్నీ వ్యాధుల కేసులు ప్రతి సంవత్సరం పెరుగుతున్నాయి.కిడ్నీ వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం మార్చిలో ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం,ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాధులు మరణాలకు ప్రధాన కారణమవుతున్నాయి. గత రెండు దశాబ్దాల్లో కిడ్నీ సంబంధిత సమస్యల కేసులు వేగంగా పెరుగుతుండటం,చిన్నారులు కూడా ఈ వ్యాధి బారిన పడుతుండటం ఆందోళన కలిగిస్తుంది. ఇండియన్ సొసైటీ ఆఫ్ పీడియాట్రిక్ నెఫ్రాలజీ నివేదిక ప్రకారం ప్రతి 10 మంది పిల్లలలో సుమారు ముగ్గురు పిల్లలకు శూన్యం పనిచేయకపోవడం (కిడ్నీ సమస్య)తో బాధపడుతున్నారంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లల్లో వచ్చే కిడ్నీ వ్యాధిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## వైద్యులు ఏమంటున్నారంటే.

మూత్రపిండాలు రక్తాన్ని ప్రాసెస్ చేస్తాయి. మూత్రపిండాలు శరీరం నుండి కలుషితాలను తొలగిస్తాయి. శరీరంలో నీటి సమతుల్యతను కాపాడటం ,మూత్రపిండాలు పెరిగిన వాల్యూమ్ ద్వారా యూరిక్ యాసిడ్ను మూత్రం ద్వారా బయటకు పంపుతాయి. శరీరంలో కాల్షియం స్థాయిని నిర్వహించడంలో కిడ్నీలు కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని,అనేక కారణాల వల్ల కిడ్నీ పనితీరు తగ్గడం ప్రారంభమవుతుందన్నారు. మూత్రపిండాల వడపోత సామర్థ్యం తగ్గడం ప్రారంభమవుతుందని,దీంతో కిడ్నీలు దెబ్బతినడం మొదలవుతుందన్నారు. కిడ్నీ వైఫల్యం ఇతర అవయవాలను కూడా ప్రభావితం చేస్తుందని ,దీని కారణంగా శరీరం అనేక వ్యాధులకు నిలయంగా మారటంతో కొన్ని సందర్భాలలో ప్రాణాంతకం కూడా కావచ్చు అంటున్నారు.

## పిల్లలు కిడ్నీ వ్యాధికి ఎందుకు గురవుతున్నారు?

ఈరోజు పిల్లల్లో ప్యాకేజ్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్ వినియోగం బాగా పెరిగిపోయిందని ఫోర్టిస్ హాస్పిటల్ యూరో–ఆంకాలజీ అండ్ రీనల్ ట్రాన్స్ ప్లాంటేషన్ విభాగం నిపుణులు చెబుతున్నారు . వీటిలో పిల్లల కిడ్నీలను దెబ్బతీసే అనేక అంశాలు ఉంటాయంటున్నారు.ప్యాక్ చేసిన ఆహారాలలో ఉప్పు కూడా ఉంటుందని ,ఇది శరీరంలో సోడియం స్థాయిని పెంచుతుందని, సోడియం కిడ్నీల నుండి నీటిని బయటకు పంపటంలో క్రియాశీలకంగా పనిచేస్తుదని ,ఇది కిడ్నీలపై ఎక్కువ ఒత్తిడిని కలిగించి మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదాన్ని పెంచుతుందంటున్నారు. ఇది మూత్రపిండాల వ్యాధికి ప్రధాన ప్రమాద కారకంగా మారుతుందంటున్నారు.


## మూత్రపిండాల వ్యాధిని గుర్తించటం ఎలా...?

పిల్లలలో స్థిరమైన బరువు తగ్గడం,ముఖం మీద వాపు డైసూరియా,మూత్రం రంగులో మార్పు,మూత్ర విసర్జనకు ఎక్కువ సమయం పడుతుండటం,కడుపు నొప్పి ఆకలి లేకపోవడం.అలసట వంటి లక్షణాల ద్వారా కిడ్ని వ్యాధిలను గుర్తించవచ్చు.

## మూత్రపిండాల ఆరోగ్యం మానవ వనశైలికి ఎంతో ముఖ్యం..

### డా. భాస్కర్ నాయక్...

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి**



మూత్రపిండాల ఆరోగ్యం మానవ జీవన శైలికి ఎంతో ముఖ్యమని, ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవడం ద్వారా కిడ్నీ సమస్యలను నివారించుకోవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ అన్నారు. ఆహారంలో ఉప్పు తగ్గించుకోవడంతో పాటు జంక్ ఫుడ్, నిల్వ ఆహార పదార్థాలు మానేయాలని రోజు కనీసం ఓ అర్ధగంట నడక మంచిదన్నారు. వ్యాయామం వలన శారీరక ,మానసిక ఆరోగ్యంతో పాటు రక్తంలో గ్లూకోజ్, రక్తపోటు తగ్గుతాయని ఇవన్నీ కిడ్నీలు ఆరోగ్యంగా ఉండేందుకు తోడ్పడతాయన్నారు.

## మానవ శరీరంలో మూత్రపిండాలు కీలకం

### డా.రవిబాబు...

**జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల పర్యవేక్షణ అధికారి**



మానవ శరీరంలో మూత్రపిండాలు కీలక భూమిక పోషిస్తాయని అవి రక్తాన్ని శుభ్రం చేయడం ద్వారా వ్యర్థాలను తొలగించి నీటి సమతుల్యతను నియంత్రించడంతోపాటు రక్తపోటును అదుపులో ఉంచుతాయన్నని డిసిహెచ్ఎస్ డా. రవిబాబు తెలిపారు. మూత్రపిండాల వ్యాధిని ప్రారంభంలో గుర్తించడం వల్ల ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని, హార్ట్ ఎటాక్స్, హైబీపీ, డయాబెటిస్ తర్వాత ఎక్కువగా ప్రజలకు కిడ్నీ సమస్యలే ఉంటున్నాయన్నారు. కిడ్నీ వైఫల్యం వలన శరీరంలో ఇతర అవయవాలు కూడా ప్రభావితం అవుతాయని దీని కారణంగా శరీరం అనేక వ్యాధులకు నిలయంగా మారుతుందన్నారు. కిడ్నీ సమస్యలపై అశ్రద్ధ చేయకుండా ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

## మూత్రపిండాల కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జీవనశైలిని సరిగ్గా ఉంచుకోవటం, పిల్లలకు ఇంటిలో వండిన సాధారణ, పోషకమైన ఆహారాన్ని ఇవ్వటం ద్వారా కిడ్ని సమస్యలను రాకుండా చూసుకోవచ్చు. పిల్లలను ఫాస్ట్ ఫుడ్ మానిపించి,తగినంత మొత్తంలో నీరు, ఇతర ద్రవాలను తాగమని చెప్పలి. మంచి ఆహారపు అలవాట్లను మనం అలవర్చుకోవటం వలన కిడ్నీ సంబంధిత వ్యాధుల నుండి రక్షణ పొందొచ్చు అని వైద్యులు తెలుపుతున్నారు.

# బండ బాదుడు..!

(మొదటి పేజీ తరువాయి...)

వినియోగదారులు అడిగినప్పటికీ సరైన సమాధానం ఇవ్వకుండా దాటవేస్తున్నారని తెలుస్తుంది.

- **సిలిండర్ కు రూ. 1000 తీసుకున్నాడు: కల్తీ కోటమ్మ**

మాది శ్రీ లక్ష్మి గ్యాస్ ఏజెన్సీ. సిలిండర్ కు రూ. 1000 తీసుకుంటున్నారు. అసలు సిలిండర్ ధర రూ. 950 అని చెబుతూ రూ. 1000 తీసుకోని, కొన్ని సందర్భాల్లో రూ. 50 తిరిగి ఇస్తున్నారు. మరికొన్ని కొన్ని సందర్భాల్లో రూ. 50 అసలు ఇవ్వడం లేదు. గ్యాస్ వాహనం వెళ్తుంటే పిలిచినా కానీ వినకుండా వేగంగా వెళ్తున్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

- **సిలిండర్ పై అదనంగా తీసుకున్నాడు: కల్తీ విజయకుమారి, అంగన్వాడి టీచర్**

గ్యాస్ బండ నింపిస్తే రు.158 ఎక్కువ తీసుకున్నారు. రూ. 950 సిలిండర్ ధర అని అంటున్నారు. చిల్లర లేదని రూ. 1000 ఇచ్చాను. మిగిలిన రూ. 50 ఇవ్వలేదు. అసలు సిలిండర్ ధర రూ. 842 అయినా కానీ తమ వద్ద రూ. 950 అని చెబుతూ, రూ. 1000 తీసుకుంటున్నారు. మాది శ్రీ లక్ష్మి గ్యాస్ ఏజెన్సీ అని, గ్రామీణ ప్రజలను దోచుకోవడం జరుగుతుంది. అంగన్వాడీ కేంద్రానికి గ్యాస్ సిలిండర్ నింపి ఇవ్వాలని ఆయా కు రూ. 1000 ఇచ్చాను. రూ. 950 సిలిండర్ అని మరో రూ. 50 అదనంగా తీసుకున్నారు. ఈ దోపిడి ఏజెన్సీ ప్రాంతంలో కొనసాగుతూనే ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రజల నుంచి అదనంగా తీసుకుంటున్న డబ్బులపై చర్యలు తీసుకొని మరో మారు ఇలా జరగకుండా చూడాలని కోరుతున్నాను.





- **అదనంగా డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు**
- **ఇల్లందు పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసిల్దార్ యాకుబ్ పాషా**

గ్యాస్ సిలిండర్ పై ఆధారంగా డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నిర్దేశించిన ధరనే గ్యాస్ ఏజెన్సీలు తీసుకోవాలి. ఒక్క పైసా అదనంగా తీసుకున్నట్లు తెలిస్తే విచారణ చేపట్టి ఏజెన్సీ పై చర్యలు తీసుకుంటాం.

# సేంద్రీయ ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యానికి మేలు

- ఐటీడీఏ పీవో బి రాహుల్.



**బూర్గంపహాడ్,మార్చి 12,ప్రజా జ్యోతి :** ప్రజల ఆరోగ్యానికి హాని తలపెట్టే పంటలు కాకుండా సేంద్రీయ ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. బుధవారం మండలంలోని గుట్ట లక్ష్మీపురం గ్రామంలో అభ్యుదయ రైతు యారం లక్ష్మారెడ్డి సేంద్రీయ ఎరువులతో సాగు చేస్తున్న పుచ్చకాయ, మిరప, జామకాయ పంటలను ఆయన పరిశీలించారు. సేంద్రియ పంటలు పండించే విధంగా ఆదివాసి గిరిజన రైతులకు సాగులో మెలకువలు, సూచనలు, సలహాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా రైతు లక్ష్మారెడ్డిని పీవో అభినందించారు. పంటలు సాగు చేస్తున్న విధానాన్ని యాజమాన్య పద్ధతుల గు రించి రైతును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీవో రాహుల్ మాట్లాడుతూ గిరిజన రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందడానికి ఆర్గానిక్ పంటలు వేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. అభ్యుదయ రైతు పామాయిల్ మొక్కలు పెంచుతూ అంతర్ పంటలుగా రైతు సాగు చేస్తున్న పుచ్చకాయ,మిరప సాగు చేస్తున్న విధానం చాలా బాగుందని అన్నారు. ఎటువంటి హానికరం లేకుండా ఆరోగ్యకరమైన పంటలు పండిస్తున్న లక్ష్మారెడ్డిని గిరిజన రైతులు ఆదర్శంగా తీసుకొని సేంద్రియ పంటలపై దృష్టి సారించాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం లో ఏడి అగ్రికల్చర్ ఉదయభాస్కర్, హార్టికల్చర్ అధికారి వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

- బిజెపి మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీ నాయక్ .



**లక్ష్మీదేవి పల్లి, మర్చి 12, ప్రజాజ్యోతి :** ఎర్రటి ఎండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించి వారి ప్రాణాలను కాపాడాలని బిజెపి మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీ నాయక్ తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లక్ష్మీదేవి పల్లి మండలం హేమచంద్రపురం గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ కూలి ప్రదేశాన్ని ఆయన బుధవారం పరిశీలించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువైతున్న సందర్భంగా అధికారులు ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ , మజ్జిగ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. మార్చి నెలలోనే ఎండలో పనిచేసేందుకు కూలీలు ఇబ్బంది పడుతూ ఎండ దెబ్బకు గురవుతున్నారన్నారు. అదే ఏప్రిల్ , మే నెలలో విపరీతమైన ఎండలు పెరిగే అవకాశం ఉన్నందున పరిస్థితులు మరింత దయనీయంగా మారే అవకాశ ఉండడంతో తక్షణమే రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాడ్ చేశారు . కూలీలకు కేంద్ర ప్రభు త్వం నిర్దేశించిన వేతనం కూలీగా రావడం లేదని, ప్రభుత్వం షెడ్యూల్ రేటు ను రూ. 300 లు క్యూబిక్ మీటర్ కి ఇచ్చే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. వేసవి కాలంలో ఉపాధి హామీ కూలీలకు అందాల్సిన అలివేన్సులు అందేలాగాచర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ కూలీలకు వేతనాలు పెంచారన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రతి ఫలాలు ప్రజలకు చేరవేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఉపాధి హామీ కూలీలకు నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలం చెందుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గుమలాపురం సత్యనారాయణ, రావుల రాము, రమేష్, మీనా తదితరులు పాల్గొన్నారు.

## నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నో స్మోకింగ్ డే




**ఇల్లందు, మార్చి 12, ప్రజాజ్యోతి :** నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా యువ అధికారి భూక్యా ప్రవీణ్ సింగ్ ఆదేశాల మేరకు బుధవారం నో స్మోకింగ్ డే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అకౌంట్స్ అండ్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ కామర్తపు భానుచందర్ సహకారంతో శ్రీ సాయి గణేష యూత్ క్లబ్ ప్రెసిడెంట్ కడారి ఉష, బాయ్స్ రెసిడెన్సీ స్కూల్ లో ఏర్పాటు చేసిన నో స్మోకింగ్ డే కార్యక్రమంలో విద్యార్థులకు ప్రోగ తాగడం వల్ల వచ్చే వ్యాధులు, అపాయాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఈ వ్యాస రచన పోటీలు, అవేర్నెస్ ర్యాలీ నిర్వహించారు. ఇందుకు సహకరిచినందుకు స్కూల్ హెచ్ఎం పి.సంజీవరావు, పిఈటి డి. క్రిష్ణ, స్కూల్ యాజమాన్యానికి నెహ్రూ యువ కేంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

## కెసిఆర్ ను కలిసిన దిండిగల



**ఇల్లెందు, మార్చి 12, ప్రజాజ్యోతి :** హైదరాబాద్ లోని నందినగర్ లో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును బుధవారం బిఆర్ఎస్ వ్యవస్థపాక సభ్యుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు, మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ కలిశారు. రాష్ట్రంలో ప్రజల గ్రౌండ్ రిపోర్ట్, పార్టీ నిర్మాణం, వచ్చే నెల నుండి నిర్వహించనున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలను వరంగల్ నగరంలో ప్రతిష్టాత్మకంగా లక్షలాది మందితో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ జయప్రదం చేసేందుకు కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామిక విధానాలు, ఎన్నికలలో హామీ ఇచ్చిన 6 గ్యారెంటీలతో పాటు 420 హామీల అమలు కోసం ప్రజా క్షేత్రంలో నిలదీయాలని, రైతులు ఇతర వర్గాల ప్రజల ఎదురుకొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

## కళాకారురాలు గుగులోతు నీలకు అవార్డు ప్రధానం





**ఇల్లందు, మార్చి 12, ప్రజాజ్యోతి :** తెలంగాణ ప్రభుత్వ భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో హైదరాబాద్ రవీంద్ర భారతిలో విజన్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో టేకులపల్లి మండలానికి చెందిన తెలంగాణ సంస్కృతిక సారథి సభ్యురాలు గుగులోత్ నీల అవార్డును అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నీలా కళాకారునిగా సాంస్కృతిక రంగంలో చురుకైన పాత్ర పోషించింది. నీలా సేవలను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంస్కృత సారథి విభాగంలో ఆమెకు ఉద్యోగం అవకాశాన్ని కల్పించింది. తెలంగాణ సంస్కృతిక సారధి విభాగంలో కూడా తన ప్రతిభను చాటుకుంటుంది. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవడంలో నీల ది అందవేసిన చేయి అనే చెప్పొచ్చు. స్వచ్ఛ భారత్, పచ్చదనం, సీజన్ వ్యాధులు మరెన్నో అవగాహన కల్పించే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవడంలో నీలా చురుకైన పాత్ర పోషిస్తుంది. సంస్కృతిక రంగంలో ఆమె ప్రతిభను గుర్తించిన ప్రభుత్వ పెద్దలు, అధికారులు రాష్ట్రస్థాయి అవార్డుకు ఆమెను ఎంపిక చేశారు. గుగులోత్ నీలా తెలంగాణ సంస్కృతిక సారధి సభ్యురాలుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఇల్లందు నియోజకవర్గ ఇంచార్జ్ బాధ్యతలు నిర్వర్తిస్తుంది. టేకులపల్లి మండలం 9వ మైలు తండ గిరిజన గ్రామంలో పుట్టిన నీల అంచలంచలుగా కళా సంస్కృతిక రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగి రాష్ట్రస్థాయిలో అవార్డు అందుకోవడం పట్ల అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు, పలువురు ప్రముఖులు ఆమెను అభినందించారు.

## కుమారుడి పేరుపై అన్నదానం



**ఇల్లెందు, మార్చి 12, ప్రజాజ్యోతి :** ఇల్లందు మండలం ఇందిరా నగర్ పంచాయతీకి చెందిన బిఆర్ఎస్ మండల నాయకుడు డేరంగుల పోశం కుమారుడు సాయి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుమారుడి ఆకస్మిక మృతితో దిగ్భ్రాంతిలో ఉన్న కుటుంబం కుమారుడి మృతి చెంది నెలరోజులు కావస్తున్నందున కుమారుడి పేరుపై బుధవారం పట్టణంలోని యాచకులు, నిరుపేద కుటుంబాలు, ప్రభుత్వ వైద్యశాలలోని రోగులు, బాటసారులకు ఆహార పోట్లాలను అందించారు. తమ కుమారుడి ఆత్మకు శాంతి చేకూరేలా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో డేరంగుల బబ్లు, గడ్డం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందులో పౌరసరఫరాల డీటీ ఆకస్మిక తనిఖీలు

- 31 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత
- 6ఏ కేసులు నమోదు.

**ఇల్లందు, మార్చి 12, ప్రజాజ్యోతి :** ఇల్లందు పట్టణం, మండలంలో బుధవారం పౌరసరఫరాల శాఖ డిటి యాకుబ్ పాషా ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో భాగంగా మండలంలోని ముకుందాపురంలో వనపర్తి వెంకటరమణ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అదేవిధంగా పట్టణంలోని నెంబర్ 2 బస్తీలో గల కంకటి సారయ్య ఇంట్లో 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం, సివిల్ లైన్ లో ఎస్.కె. మహబూబ్బీ ఇంట్లో నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు డిటి తెలిపారు. పట్టుబడ్డ వారిపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆకస్మిక దాడులు నిర్వహించామని భవిష్యత్తులో సైతం పిడిఎఫ్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఉద్యోగుల యాన్యువల్ ఇంక్రిమెంట్ కై ఆడిట్ నిర్వహణ



**ఇల్లందు, మార్చి 12, ప్రజాజ్యోతి :** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా వైసీఓఏ క్లబ్ లో మార్చి నెల అర్హతను అనుసరించి ఎన్సిడబ్ల్యూఏ ఉద్యోగులకు బుధవారం యాన్యువల్ ఇంక్రిమెంట్ బేసిక్ అప్డేషన్ కై కార్పొరేట్ ఆడిట్ డిపార్ట్మెంట్ సిబ్బంది వినేష్ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఈ యాన్యువల్ ఇంక్రిమెంట్ ఆడిటింగ్ కార్పొరే ట్ కార్యాలయానికి వెళ్లి ఆడిటింగ్ జరిగేదని, ఇప్పుడు ఈ ప్రక్రియను ఇల్లందు ఏరియాకు ఆడిట్ డిపార్ట్మెంట్ వచ్చి ఉద్యోగుల యాన్యువల్ ఇంక్రిమెంట్ మార్చి నెలసరి జీతంతో రావడం కొరకు ఎలాంటి జాప్యం జరగకుండా ఇంటర్నల్ ఆడిట్ డిపార్ట్మెంట్ బృందంతో ఆడిటింగ్ ను నిర్వహించామన్నారు. ఈ ఆడిటింగ్ లో ఇల్లందు ఏరియాలోని మైన్స్, డిపార్ట్మెంట్ ఉద్యోగుల యాన్యువల్ ఇంక్రిమెంట్ ను ఆడిటింగ్ చేయడం జరిగిందని, అలాగే ఆడిటింగ్ లో వ్యక్తపరిచిన సందేహాలను పరిష్కరిస్తూ తగిన సమయంలో సుమారు 394 మంది ఉద్యోగుల బేసిక్ అప్డేషన్ ప్రపోజల్ ను ఆడిటింగ్ చేశామని తెలిపారు. ఇందులో 307 మంది ఉద్యోగులు డైలీ రిలేటెడ్ వారు ఉండగా 87 మంది మంది రిటైడ్ ఉద్యోగులు ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిజియం (పర్సనల్ ) జీవి. మోహన్ రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ అజయ్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ లలిత, ఇల్లందు ఏరియాలోని మైన్స్, డిపార్ట్మెంట్ లలో పని చేస్తున్న సంబంధిత క్లరికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కృత్రిమ మేధస్సుతో విద్యాబోధన సులభం



**బూర్గంపహాడ్,మార్చి 12, ప్రజా జ్యోతి :** కృత్రిమ మేధస్సుతో విద్యాబోధన సులభమని ఐటిడిఏ పివో బి.రాహుల్ అన్నారు. బుధవారం బూర్గంపాడు మండలం సారపాకలోని గాంధీనగర్ ఎంపీపిఎస్ పాఠశాలలో కృత్రిమ మేధస్సుతో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న తరగతులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చదువులో వెనుకబడిన పిల్లలను గుర్తించి అభ్యాసన మెరుగుపడడానికి, విద్యార్థుల స్థాయిని అంచనా వేయడానికి ఇది ఎంతో ఉపకరిస్తుందని అన్నారు. అలాగే అభ్యాస కృత్యాలు ప్రతి విద్యార్థికి నిర్వహించడం వలన విద్యాభ్యాసం పట్ల పిల్లలలో మరింత ఉత్సాహం పెంపొందించవచ్చని, కఠినమైన పదాలు కాకుండా చిన్న తరగతుల వారికి ఇంగ్లీషులో చిత్రాల ద్వారా కృత్యాలు నేర్పడం, గేమ్స్, లెసన్స్ సంబంధించిన వర్క్ బుక్ లాంటివి చిన్న చిన్న పదాలు అర్థమయ్యేలా నేర్పించాలని అన్నారు. మండలంలో అంజనాపురం, మొరంపల్లి బంజర్, బూర్గంపాడు, నాగినేని ప్రోలు, సారపాక లోని గాంధీనగర్ పాఠశాలలో పైలెట్ ప్రాజెక్టు కింద ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారని ఎంఈఓ యదు సింహరాజు పీవో కి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, ఫ్యాకల్టీలు లక్ష్మీ ప్రసన్న, గోపాలరావు, శ్రీనివాసరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మేలుజాతి దూడల ప్రదర్శన, పాడి రైతులకు అవగాహన సదస్సు



**బూర్గంపహాడ్, మార్చి 12, (ప్రజా జ్యోతి ) :** బూర్గంపహాడ్ మండలం మొరంపల్లి బంజర గ్రామంలో మంగళవారం ఐటిసి బంగారు భవిష్యత్ ప్రోగ్రాం ద్వారా బైఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మేలుజాతి దూడల ప్రదర్శన వాటి పెంపకంపై పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మొరంపల్లి బంజర్ పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 75 మేలుజాతి ఆవులు, గేదెలు, దూడలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాడి రైతులకు పశుపోషణ, సాంకేతిక విధానాలు, ఆధునిక పద్ధతులపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐటిసి బంగారు భవిష్యత్ ప్రోగ్రాం ముఖ్య అధికారి జయప్రకాష్, బైఫ్ సంస్థ రాష్ట్ర ముఖ్య అధికారి హేమంత్, బైఫ్ సంస్థ క్షేత్ర అధికారి సదయ్య, టెక్నీషియన్ వెంకటరామిరెడ్డి, గ్రామస్థులు, రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

## అదనపు ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు



**బూర్గంపహాడ్, మార్చి 12, ప్రజా జ్యోతి :** బూర్గంపహాడ్ మండలం సారపాక తాళ్లగొమ్మూరు విద్యుత్ ఉపకేంద్రంలో అదనపు ట్రాన్స్ ఫార్మర్ ను ఈఈ మహేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలో రోజురోజుకీ విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో నిరంతరం విద్యుత్ సరఫరా చేయటానికి సుమారు 1కోటి 50 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. త్వరలోనే పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టి ఈ ప్రాంత వాసులకు అంతరాయం లేకుండా విద్యుత్ అందించడానికి తాము కృషి చేస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడి కె.జీవన్ కుమార్, బి వెంకటేశ్వర్లు, జె. రాంబాబు, టి. వేణు, ఉపేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతర

- సందిబంధం గ్రామ బొమ్మల వంశీయుల ఆరాధ్య దైవం.



**ఆళ్ళపల్లి, మార్చి12, ప్రజాజ్యోతి :** ఆళ్ళపల్లి మండల సంధిబంధం గ్రామంలో శ్రీ సమ్మక్క సారక్క జాతర సందర్భంగా బుధవారం మండల స్థాయి క్రీడలు ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టి పి టి ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగు రాంబాబు హాజరై క్రీడలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు వివిధ పండుగలను జరుపు కుంటారు. గిరిజనుల పండుగలు ఐక్యతకు ప్రతిరూపం ఎంతో సందడిగా ఉంటాయన్నారు. ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలు కట్టుబాట్లతో జీవనం ఆహారం గొప్ప ఐక్యత అడవి తల్లి ఒడిలో నిత్యం ఇలా ప్రత్యేక జీవన శైలి ఆదివాసీలకి సొంతం. నీతి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం. గిరి మాణిక్యాలు తమ సంస్కృతిని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.ఈ కార్యక్రమం లో ఈసం రవీందర్ టీచర్, టి పి టి ఎఫ్ మండల అధ్యక్షులు భోజ్య, పాయం పాపారావు, పాయం సత్యనారాయణ, సోలం జనార్దన్, గ్రామ పెద్దలు జోగ.సారయ్య, చిన గౌరయ్య, గోగ్గల.రమేష్, కొమరం, బాబు, రామయ్య, రమేష్, సత్యం, ఏడుల్లా, రమేష్, బూడిద కొమరం, నాగేశ్వర రావు, గ్రామ యూత్ కమిటి, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాడు

- సిపిఐ పార్టీకి ఎమ్మెల్సీ సీటు ఇవ్వడం హర్షించ దగ్గ విషయం
- సిపిఐ మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి.




**చుంచుపల్లి మార్చి 12 ప్రజా జ్యోతి :** రాష్ట్రంలో ప్రజలకు సుస్థిర పాలన అందించడంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అభ్యర్థన మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిపిఐ పార్టీకి ఎమ్మెల్యే ఎమ్మెల్సీ సీటు నివ్వడం ఎంతో హర్షించదగ్గ విషయమని సిపిఐ మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని చుంచుపల్లి మండల సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు నాయకత్వంలో సిపిఐ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అభ్యర్థి నెల్లిగంటి సత్యాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు కృషి చేస్తామన్నారు. సిపిఐ పార్టీపై నమ్మకం ఉంచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్సీ సీటు కేటాయించిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు దుర్గరాశి ఎంకన్న, సంయుక్త కార్యదర్శి డి వీరస్వామి, సహాయ కార్యదర్శి పోలమూరి శ్రీనివాస్, నాయకులు భాగం మహేశ్వరరావు, బాబ్జి తోటరాజు జగన్, పియాలాద్రి మహేష్, జకరయ్య కోటేశ్వరరావు, కొరదల శ్రీను పాల్గొన్నారు .

## శ్రీరామనవమి, పట్టాభిషేకం టికెట్లు ఆన్లైన్ లో అమ్మకం ప్రారంభం

- 70 శాతం టికెట్లను ఆన్లైన్ లో ఉంచిన భద్రాద్రి దేవస్థానం.

**భద్రాచలం, మార్చి 12(ప్రజాజ్యోతి ):** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న జరిగే శ్రీరామనవమి, 7న నిర్వహించే స్వామి వారి పట్టాభిషేకం టికెట్లను బుధవారం నుంచి ఆన్లైన్లో భద్రాద్రి దేవస్థానం అధికారులు భక్తులు కొనుగోలు చేసేందుకు అందుబాటులో ఉంచారు. కల్యాణం ఉభయదాతల టికెట్టు రూ.7,500, సెక్టార్ల టికెట్లు రూ.2,500, రూ.2 వేలు, రూ.1000, రూ.900, రూ.150 టికెట్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఏప్రిల్ 7న జరిగే శ్రీ సీతారామచంద్రస్వామి వారి పట్టాభిషేక మహోత్సవానికి రూ.1500, రూ.500, రూ.100 టికెట్లుఆన్లైన్లో విక్రయానికి అందుబాటులో ఉంచారు. ఈ టికెట్స్ ను భద్రాద్రిటెంపుల్. తెలంగాణ. జీవోవీ వెబ్సైట్లో కొనుగోలు చేయాలని దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి భక్తులకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఉత్సవాలకు రాలేని భక్తులు తమ గోత్రనామాలతో కల్యాణం జరిపించే సేవల కోసం రూ.5,000, రూ. 1, 116 టికెట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. టికెట్లు కొనుగోలు చేసి న భక్తులు ఈ నెల 20 నుంచి భద్రాచలంలోని తానీషా కల్యాణ మండపంలో ఒరిజినల్ గుర్తింపు కార్డు చూపించి టికెట్లు పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 20 నుంచి భద్రాచలంలో నేరుగా సెక్టారు టికెట్లు విక్రయించనున్నారు. రామాలయం వద్ద మెయిన్ కౌంటరు, తానీషా కల్యాణ మండపం, సీఆర్వో కార్యాలయాల్లో కౌంటర్లు ఏర్పాటు చేశారు. భద్రాచలం ఆర్డీవో ఆఫీసు వద్ద వచ్చే నెల ఒకటి నుంచి కౌంటర్ అందుబాటులో ఉంటుంది.

## ఐద్వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ

- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి సీతా లక్ష్మి.



**భద్రాచలం టౌన్, మర్చి 12, ప్రజాజ్యోతి :** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం అవిర్భవ దినోత్సవం సందర్భంగా ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా నాయకురాలు నాదెళ్ల లీలావతి జెండా ఆవిష్కరణ చేశారు . ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సీతా లక్ష్మి మట్లాడుతూ 1981 లో మద్రాస్ లో ఐద్వా మొట్ట మొదటి మహాసభ జరిగిందని,ఈ మహా సభ 1981 మార్చి 10,11,12 తేదీలలో మూడు రోజుల పాటు మహాసభ నిర్వహించి మార్చి 12న అంతర్జాతీయ మహిళా సంఘం ఏర్పటు చేశారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో ఆంధ్ర ప్రదేశ్ మహిళా సంఘం గా, పశ్చిమ బెంగాల్ లో ఘనతంత్ర మహిళా సమితి గా వివిధ రాష్ట్రాలలో వివిధ పేర్లతో సంఘం ఏర్పాటు జరిగిందని, ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విమోచన నినాదాలుగా అప్పటినుంచి ఐద్వా పని చేస్తూ, ఐద్వా దేశవ్యాప్తంగా పట్టణాల్లోనూ గ్రామాల్లో ఉన్న సాధారణ మహిళల్ని సమీకరించి మహిళల సమస్యల పరిష్కారం కోసం ఒక బలమైన మహిళా ఉద్యమాన్ని నిర్మించడం కర్తవ్యంగా పెట్టుకుందని అన్నారు . చట్టరీత్యా హక్కులున్నా అవేవీ కూడా స్త్రీలకు అందుబాటులో లేకున్నా ఉండటం, వీటికి తోడు అత్యాచారాలు, వరకట్న మరణాలు, కుటుంబంలో హింస బలవంతపు పెళ్లిళ్లు ,బాల్యవివాహాలు , బహుభార్యత్వం వంటి అనేక సమస్యలు స్త్రీలను వేధిస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో స్త్రీలు తమకు తాము సంఘటతం కావాలని , తమొక్కరే కాకుండా ఇతర ప్రజాసంఘాలతో కార్మికులు, రైతుల, యువత, విద్యార్థులు వంటి సాధారణ ప్రజాసంఘాలతో కలిసిమెలిసి పనిచేస్తూ, ప్రజల హక్కుల సాధన కోసం ఉద్యమాలు నిర్మించాలని ఆమె అన్నారు. మహిళా సంఘం ఇచ్చే పిలుపులో మీరందరు భాగస్వామ్యం కావాలి అని ఆమె కోరారు. ఈ కార్యక్రమలో జీవన జ్యోతి, జీ నాగలక్ష్మి , ఎం సుబ్బలక్ష్మి ,పి.దేవి , డి నాగలక్ష్మి , ఎమ్ కృష్ణ కుమారి, పి.శాంతి , విజయాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు .

## ప్రయివేటు వ్యక్తులు లడ్డూ ప్రసాదాలు విక్రయిస్తే కఠిన చర్యలు దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి వెల్లడి

**భద్రాచలం, మార్చి 12(ప్రజాజ్యోతి ) :** భద్రాచలంలోని రామాలయం పరిసరాల్లో ఉండే వివిధ దుకాణాల వద్ద స్వామి వారి లడ్డూ ప్రసాదం పేరుతో ఎవరైనా లడ్డు, పులిహోర భక్తులకు విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని భద్రాచలం దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి పేర్కొన్నారు. ముఖ్యంగా శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సమయంలో బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వారు, స్థానిక వ్యాపారస్తులు ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని కోరారు. దేవస్తానం దృష్టికి వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని ఈవో హెచ్చరించారు.

# ఉపాధి హామీ లక్ష్యాలను పూర్తి చేయాలి..




**కొత్తగూడెం కలెక్టరేట్ , మార్చి 12, ప్రజా జ్యోతి :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఉపాధి హామీ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఐడిఓసి కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అతను విద్యాచందన తో కలిసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తీరు క్లస్టర్ వారిగా పని దినాలు చేపడుతున్న పనులు, ఆస్తి పన్ను వసూలు పురోగతి, ధరణి పెండింగ్ దరఖాస్తులు, ఎల్ ఆర్ ఎస్ పెండింగ్ దరఖాస్తులు తదితర అంశాలపై జిల్లాలోని తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు , సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఉపాధి పనులు కల్పించేందుకు ఎక్కువ అవకాశం గల పనులు పై దృష్టి సారించాలని, ఉపాధి కూలీలకు వంద రోజుల పని దినాలు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో చేపడుతున్న ఫారం పాండ్స్, ఫీడర్ ఛానల్ పనులు, రోడ్డు ఫార్మేషన్, ట్రంచ్ వర్కులు, బౌండరీలు తదితర పనులకు సంబంధించిన అంశాలపై క్లస్టర్ల వారీగా సమీక్షించారు. క్లస్టర్ల వారీగా చేపట్టే పనులలో లేబర్ మొబలైజేషన్ ఎక్కువగా ఉండాలని, వారికి పని దినాలు కల్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలోని ప్రతి రైతు తన వ్యవసాయ భూమిలో ఫారం పాండ్స్ కచ్చితంగా ఏర్పాటు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో బోరు పై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతుల వివరాల జాబితా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఫారం పాండ్స్ తవ్వడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని, పందిరి సాగు, చేపల పెంపకం ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని కలెక్టర్ తెలిపారు. భూగర్భ జలాలను పెంచడం కోసం, ఆనతి కాలంలో నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు ప్రతి రైతు కచ్చితంగా ఫారం పౌండ్ లు ఏర్పాటు చేయవలసిందే అని ఆయన స్పష్టం చేశారు. మార్చి 31 వ తేదీలోపు ఉపాధి హామీ పనులన్నీ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రయోగాత్మకంగా గ్రామాల అభివృద్ధిలో యువతను భాగస్వామ్యం చేసేలా, రేపు జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఒకచోట ఇంకుడు గుంతలు తవ్వకాలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పనులన్నీటిని ఉపాధి హామీ పథకంలో కాకుండా గ్రామాల్లోని అందరి సమన్వయంతో నిర్వహించాలని దానికి కావలసిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఒక గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, రహదారుల పక్కన ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని ఆయన తెలిపారు. చేపట్టిన నిర్మాణాలు అన్నింటి నీ జల సంచేయ్ జన్ భగీదారి ప్రోగ్రాంలో అప్లోడ్ చేయాలని, దాని ద్వారా దేశంలోని జిల్లా ఇంకుడు గుంతల నిర్మాణాల్లో మొదట నిలిచేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. మార్చి 15 తేదీలోగా జిల్లాలోని అన్ని ఆస్తి పన్నుల బకాయిలు 100% వసూలు చేయాలని పంచాయతీ సెక్రటరీలను కలెక్టర్ ఆదేశించారు. మార్చి 15 తరువాత ఎవ రైతే బకాయిలు చెల్లించలేదో వారి వివరాలను ఫ్లెక్సీల ద్వారా గ్రామాలలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలని, లేదా ఇంటిముందు డప్పులు వాయించాలని కలెక్టర్ తెలిపారు. ఆస్తి పన్నులు ద్వారానే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న ధరణి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. త్రాగునీటి సరఫరా లో సమస్యలను సత్వరమే పరిష్కరించి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల ఎల్ వన్ జాబితాను శనివారంలోగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, పిడి హౌసింగ్ శంకర్, జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటేశ్వర చారి, పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాస రావు , మిషన్ భగీరథ ఈ ఈ తిరుమలేష్, నలిని, డి ఎల్ పి ఓ సుధీర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వీధి కుక్క దాడి వ్యక్తికి తీవ్రగాయాలు





**పాల్వంచ, మార్చి 12, ప్రజాజ్యోతి :** వీధి కుక్కల దాడిలో పోసారపు బిక్షమయ్య అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన పాల్వంచ వెంగళరావు కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికలు తెలిపిన వివరాలు ప్రకారం పోసారపు భిక్షమయ్య రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి, వారి మనవడిని డీ.ఏ.వీ స్కూల్ నుండి ఇంటికి తీసుకురావడానికి వెళ్తుంటే, కేటీపీయస్ కాల ని ముత్యాలమ్మ గుడి దగ్గర కుక్కలు దాడి చేయడంతో టూ వీలర్ నుండి పడ డం వల్ల తీవ్రంగా దాడి చేయడంతో హుటాహుటిన పాల్వంచ ప్రభుత్వ దవాఖానా కు తరలించారు. అక్కడ ట్రీట్మెంట్ అందించడం తొ కోలుకున్నాడు. పాల్వంచ మున్సిపల్ పరిధిలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ముఖ్యంగా కేటీపీయస్ లో విపరీతంగా ,విచ్చలవిడిగా సంచరిస్తున్నాయని ఆరోపణలు వున్నను పట్టించుకోవడం లేదని,ఇట్టి విషయమై కేటీపీయస్ సివి ల్ ఆఫీస్ వాళ్లు పలుమార్లు విన్నవించుకున్న ఫలితం శూన్యం అంటున్నారు. కాలనీ వాసులు,ఇకనైనా కేటీపీయస్ సంబధిత అధికారులు (సీ.ఈ)పట్టించుకొని సమస్యను నివారించాలని కాలని వాసులు కోరుతున్నారు.

## ఘనంగా అభయ ఆంజనేయ స్వామి వార్షికోత్సవం



**టేకులపల్లి, మార్చి12, ప్రజాజ్యోతి:** మండలంలోని కొప్పురాయి పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో శ్రీ శ్రీనివాస చార్యులు , రాము చార్యులు ఆధ్వర్యంలో ఘనంగా శ్రీశ్రీశ్రీ అభయాంజనేయస్వామివార్షికోత్సవం ,స్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి కళ్యాణం,హోమము పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజలలో గ్రా మ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామివారికి గ్రామ ప్రజలు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు , కుంజా రవి , పునెం వీరస్వామి , చీమల నరేష్ , పునేం నరసింహారావు , కుంజా రమేష్ , గ్రామ పెద్దలు పాల్గొన్నారు .

## కొత్తగూడెం & కార్పొరేట్ ప్రాంతాలకు ప్యానల్ అడ్వకేట్‌గా వెల్లంకి వెంకటేశ్వరరావు నియామకం



**కొత్తగూడెం సింగరేణి, మార్చి 12, ప్రజాజ్యోతి :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (SCCL) దేశంలోని అతిపెద్ద కోల్ మైనింగ్ సంస్థల్లో ఒకటిగా, తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో కీలక భూమిక పోషిస్తోంది. వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తూ, రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తును అందిస్తున్న ఈ ప్రఖ్యాత సంస్థ నూతనంగా కొత్తగూడెం & కార్పొరేట్ ప్రాంతాలకు ప్యానల్ అడ్వకేట్‌గా వెల్లంకి వెంకటేశ్వరరావుని నియమించడం గర్వకారణం. వెల్లంకి వెంకటేశ్వరరావు కొత్తగూడెం రామచంద్ర ఆర్ట్స్ & సైన్స్ కాలేజ్‌లో డిగ్రీ పూర్తి చేసి, ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం లో న్యాయ విద్య అభ్యసించారు. 1992లో కొత్తగూడెం బార్ అసోసియేషన్‌లో అడ్వకేట్‌గా నమోదు అయ్యారు. న్యాయ రంగంలో ఆయనకు విస్తృత అనుభవం ఉండటంతో, సింగరేణి సంస్థకు న్యాయ పరంగా విశిష్ట సేవలు అందించేందుకు ఈ నియామకం ఎంతో మైలురాయిగా నిలవనుంది. సింగరేణి సీ&ఎండి డాక్టర్ బలరాం నాయక్ కి సింగరేణి సమస్త డైరెక్టర్స్ కు కృతజ్ఞతలు తెలియజేసిన వెల్లంకి వెంకటేశ్వరరావు. ఈ సందర్భంగా వెల్లంకి వెంకటేశ్వరరావు నియామకాన్ని హర్షించిన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క , మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు , వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, టీపీసీసీ సభ్యులు జేబీ శౌరి, సీనియర్ న్యాయవాదులు బాబురావు, విజయకుమార్, పురుషోత్తం, జీవికే మనోహర్, జీవీ ప్రసాద్, కె. పుల్లయ్య, గణేష్ బాబు, ఉదయ భాస్కర్, కోటం రాజు, బార్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, మనుబోతుల సత్యనారాయణ, పోసాని రాధాకృష్ణ, వీ.వి. సుధాకర్, వై.వి. రామారావు, నాగిరెడ్డి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తి మృతి



**ఇల్లెందు, మార్చి 12, ప్రజాజ్యోతి:** మండలంలోని పోలారం గ్రామంlon చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే పోలారం గ్రామానికి చెందిన మోటపోతుల అప్పారావు (43) సాయంత్రం 4 గంటల సమయంలో వేపచెట్టు ఎక్కేందుకు ప్రయత్నించాడు. చెట్టు తడిగా ఉండడంతో కాలు జారి కింద ఉన్న పుట్టపై పడ్డాడు. చాతికి బలమైన గాయాలు కావడంతో వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందిన్నట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదవశాత్తు అప్పారావు మృతి చెందడంతో ఆయన కుటుంబంతో పాటు పోలారం గ్రామం విషాద ఛాయలు అలుముకున్నాయి.

## విజ్ఞానంతో పాటు మేధాశక్తిని పెంపొందించుకోవాలి

**భద్రాచలం, మార్చి 12(ప్రజాజ్యోతి ):** గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులు విజ్ఞానంతో పాటు మేధాశక్తిని పెంపొందించుకోవాలని గురుకుల డిగ్రీ కళ్ళాశ్యాల సీనియర్ ఉపాధ్యాయురాలు, లైజన్ ఆఫీసర్ లక్ష్మి అన్నారు. స్టడీ టూర్లో భాగంగా విద్యార్థినులతో కలిసి బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో విభాగాలు, మొబైల్ కోర్టు, గిరిజన మ్యూజియంను సందర్శించి అక్కడ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఐటీడీఏ ద్వారా ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాల గురించి ఆ శాఖలకు సంబంధించిన అధికారులు, విద్యార్థినిలకు తెలియజేశారు. మొబైల్ కోర్టు ద్వారా గిరిజనుల భూములకు సంబంధించిన విషయాలు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారని, గిరిజన మ్యూజియంలో పాతతరంకు సంబంధించిన కళాఖండాలు ఆచార వ్యవహారాలు సాంస్కృతి సంప్రదాయాలు కట్టుబాట్లు గురించి విద్యార్థినులకు తెలియజేయడం జరిగిందని ఆన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాకల్టీలు అంజలి, నీలిమ, సింధు, 46 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## వరి సాగులో నీటినీ ఆదా చేసే పద్ధతిపై రైతులకు శిక్షణ కార్యక్రమం

**టేకులపల్లి, మార్చి 12, ప్రజాజ్యోతి :** మండలంలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్ లోని రైతు వేదికలో వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్మెంట్ ట్రైనింగ్ సెంటర్ హైదరాబాదు వారు వర్ష దారిత ప్రాంతాలలో నేల, నీటి సంరక్షణ పద్ధతులు నీటి కుంటలు నిర్మాణం వరి సాగులో నీటిని ఆదా చేసే పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చారు. వాలాంతరి పరిశోధన సంస్థ నుండి సుబ్బారావు మాట్లాడుతూ అధిక వర్షపాతం కురిసినప్పుడు వర్షపు నీటిని నీటి కుంటల ద్వారా సంరక్షించుకోవచ్చు అలాగే డ్రిప్ ఇరిగేషన్ నీటి కొరత ఉన్న ప్రదేశాలలోనే కాదు ఎక్కువ నీరు ఉన్నా కూడా నీటిని తగ్గించి డ్రిప్ ద్వారా పంటలు పండించవచ్చునని తెలిపారు. వాగుల ద్వారా ప్రవహించే నీటిని చెక్ డ్యాంల ద్వారా సంరక్షించవచ్చని తెలిపారు. కె వి కే కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ మాట్లాడుతూ టేకులపల్లి లో బిన్న రకాల పంటలు పండించే ఆనవైతి ఉందని ఇంకా పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. ఏడిఏ లాల్చంద్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి రైతు బోర్ పక్కన 20 మీటర్ల పొడవు , 20 మీటర్ల వెడల్పుతో నీటి కుంటను తీసుకుని నీటిని రీఛార్జ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాలాంతర్ ఏవో ఎస్. అన్నపూర్ణ, ఎంఏఓ ఎన్. అన్నపూర్ణ, ఏఈఓ లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



